క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

కొమరాడ: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కూడా ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్, మందుల గదిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యుడు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈఈ శ్రీనివాసరావు

భామిని: స్థానిక సబ్‌స్టేషన్ ట్రాన్స్‌కో ఏఈఈగా బి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తన వంతు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



బాలేరు ఆర్‌బీకే వద్ద ఎరువుల బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

భామిని: మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు వచ్చి చేరాయి. రైతుల అవసరాల దృష్ట్యా వీటిని పంపిణీ చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. బాలేరు రైతు భరోసా కేంద్రానికి ఇప్పటికే 450 బస్తాల ఎరువులు వచ్చినట్లు రైతు మిత్ర తిరుపతిరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం



తంపటాపల్లి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో ఎంపీడీఓ డొంక త్రినాథులు శనివారం పర్యటించి, ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆ గ్రామాన్ని సందర్శించిన సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆ గ్రామం వెళ్లిన ఎంపీడీఓ అక్కడి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పనిప్రదేశంతో తాగునీరు,టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూడాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

పాలకొండ రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధమని ఎస్‌ఐ బి.శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పాలకొండ–సీతంపేట రోడ్డు పరిసరాలు, అక్కడి దాబాలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఎవరైనా దాబాలు, హోటళ్లలో, ఆరుబయట మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భామిని: మండలంలోని సింగిడి గ్రామానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ మాలి రవి(33) గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బోనగడ్డి ధర్మారావు, బొడ్డేపల్లి ప్రసాద్ శనివారం ఆ గ్రామానికి చేరుకుని, బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.ఝాన్సీరాణి, సర్పంచ్ మడపాన కేశవ, మాజీ ఎంపీటీసీ పత్తిక సింహాచలం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో..
జీవన ప్రమాణాలు మెరుగు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కోడిశ గ్రామ సచివాలయ పరిధిలోని ముత్యాలు, ఎగువ ముత్యాలు, దిగువ ముత్యాలు, కోతాం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపలో సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ నాయకులు రాము, అబ్బాస్, రమేష్, కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ: వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామీణులకు వైద్యసేవలు అందించేందుకు 104 వాహన సేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కూడా అమలు చేస్తున్నారన్నారు. దీంతో ప్రతీ ఇంటికి వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా, ఏరియా ఆస్పత్రిలోని రోగులకు రోజుకు అయ్యే భోజనం ఖర్చు రూ.40 నుంచి రూ.80 పెంచి అందిస్తోందన్నారు. ఆస్పత్రిలో సరిపడ సిబ్బంది, యంత్ర పరికరాలు, మందులు కూడా ఉండేలా జాగ్రత్త వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది కూడా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు వివరించారు. ఆ తర్వాత పలు నిర్ణయాలపై కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో ఆర్ఎంఓ రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ రమేష్

పాలకొండ రూరల్: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ రమేష్ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించిన ఆయన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను కూడా వివరించి, నిర్మాణాల పూర్తికి వారు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ



రైతులకు పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య చేతులమీదుగా రైతులకు పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లను అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. 40 శాతం ప్రభుత్వ రాయితీ, 50 శాతం బ్యాంకు రుణ సదుపాయంతో వీటిని అందజేస్తున్నామని, ఇవి కావాల్సిన వారు కేవలం 10 శాతం వాటా మాత్రమే చెల్లిస్తే చాలు అని ఏఓ తెలిపారు. యంత్రాల కోసం ఈ నెల 12వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక రాజారావు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ టి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్‌లో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ షణ్ముఖరావు, సిబ్బంది అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులను ఆపి, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. లైసెన్స్‌తో పాటు సీ, ఆర్‌సీ బుక్‌లు, పొల్యూషన్ పత్రాలను గమనించారు. ఆయా పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనంతో రోడ్డుపైకి వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవ్ చేస్తున్న వారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. అలాగే అతివేగంగా వాహనాలు నడపరాదని, మద్యం తాగి డ్రైవ్ చేయకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

సిరిమానోత్సవానికి బందోబస్తు ఏర్పాటు

- పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు



మాట్లాడుతున్న పాలకొండ డీఎస్పీ కృష్ణారావు

వీరఘట్టం: పైడితల్లి అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరిగే సిరిమానోత్సవానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు తెలిపారు. శనివారం స్థానిక పట్టణంలోని విలేకరులతో మాట్లాడిన ఆయన ఏడేళ్ల తర్వాత జరిగే ఈ ఉత్సవానికి భారీ సంఖ్యలో జనం హాజరుకానున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తామని తెలిపారు. పార్వతీపురం–పాలకొండ రోడ్డు మీదుగా వెళ్లాల్సిన వాహనాలను కొత్తబస్టాండ్ మీదుగా బార్నాల వీధి నుంచి బీఎంఆర్ థియేటర్ నుంచి టింబర్ డిపో పక్కదారి గుండా బీసీ కాలనీ రోడ్డు చేరుకుని, అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్ గుండా వాహనాలను మళ్లిస్తున్నామన్నారు. ఉత్సవానికి వచ్చే వాహనదారుల కోసం ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్ కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాలకొండ నుంచి వచ్చే వాహనాలను పెట్రోలుబంకు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోను, పార్వతీపురం నుంచి వచ్చే వాహనాలను తహసీల్దారు కార్యాలయం సమీపంలో, జెడ్పీ హైస్కూల్ మైదానంలో పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే అంబేడ్కర్ జంక్షన్ నుంచి బీఎంఆర్ థియేటర్ వరకు, గ్రోమోర్ సెంటర్ నుంచి హాస్పిటల్ జంక్షన్ వరకు రోడ్డులో ఎటువంటి వాహనాలు నిలపవద్దన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలో ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి శనివారం ప్రారంభించారు. ఈ నెల 8వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో అందరూ పాల్గొని, క్రీడాస్ఫూర్తి కనబరచాలని కోరారు. అంతకుముందు సదరు నేతలు క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఆల్ ది బెస్ట్ తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం



పాలకొండలో ఓ వీధిలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వేసవి ఎండల ధాటికి ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ఈ వర్షంతో వాతావరణం కాస్త చల్లబడడంతో ఉపశమనం పొందారు. దుక్కులు పూర్తి చేసిన వారు పచ్చిరొట్ట వేసుకునేందుకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



చింతమానుగూడ గిరిజన మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని పొక్కిరి, పొక్కిరగూడ, వాడకొయ్య, డంగులగూడ, సుక్కుగాడిగూడ, మామిడిమానుగూడ, జుంబిరి, చింతమానుగూడ, నాయుడుగూడ, పెద్దగూడ, కారిగూడ, ధర్మలక్ష్మీపురం గిరిజన గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామంలోని సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతీ ఇంటికి మేలు జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేయాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆయన అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీ నాయుడు, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ పరిధిలోని అడ్డంగూడ, మురడ, చెముడుగూడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.సాల్మన్ రాజు శనివారం పరిశీలించారు. తొలుత వేతనదారుల మస్తర్లు పరిశీలించిన ఆయన జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని, పనిలో ఉన్న వారికే మస్తరు వేయాలని సూచించారు. వేతనదారులు కూడా నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే రోజుకు రూ.257 గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

భామిని: మండలంలోని కోసలి, కీసర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు శనివారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేయాలని సూచించారు. నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని తెలిపారు.



భామిని: కీసరలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

పదో తరగతి ఫలితాల్లో..
విద్యార్థుల సత్తా..

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో చాలా మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి, సత్తా చాటారు. టాపర్లుగా నిలిచిన వారందరికీ పాఠశాలల సిబ్బంది, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

సీతంపేట: పదో తరగతి ఫలితాల్లో స్థానిక ఐటీడీఏ పరిధిలోని 39 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 88.58 శాతం ఉత్తీర్ణతా శాతం లభించినట్లు సిబ్బంది పేర్కొన్నారు. వీటిలో 14 ఆశ్రమ పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించాయి. నాలుగు గిరిజన గురుకుల పాఠశాలల్లో 96.95 శాతం ఫలితాలు వచ్చాయి. వీటిలో స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాల శతశాతం ఫలితాలు సాధించింది. ఆశ్రమ పాఠశాలల నుంచి 1401 మంది పరీక్షలకు హాజరు కాగా, 1241 మంది పాసయ్యారు. గురుకులాల నుంచి 295 మంది హాజరు కాగా, 286 మంది ఉత్తీర్ణులయ్యారు. సీతంపేట, సామరెల్లి, హడ్డుబంగి, బడ్డుమాసింగి, బుడంబో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించింది. ఇక్కడి నుంచి మొత్తం 51 మంది పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు.

బాలికలదే పైచేయి..

గుమ్మలక్ష్మీపురం: మండలంలో పదో తరగతి ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. మండలంలోని మొత్తం 13 పాఠశాలల నుంచి 723 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 713 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో మండలానికి 98.62 ఉత్తీర్ణత శాతం లభించింది. వీరిలో 99.28 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులు కాగా, బాలురు 97.70 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కేడీ కాలనీ జీటీడబ్ల్యూఏ స్కూల్(గరల్స్) నుంచి 44 మంది పరీక్షలు రాయగా, 44 మంది, కొత్తగూడ జీటీడబ్ల్యూఏ స్కూల్(బాయ్స్) నుంచి 64 మందికి 60 మంది, తాడికొండ జీటీడబ్ల్యూఏ స్కూల్(బాయ్స్) నుంచి 28 మందికి 27 మంది, భద్రగిరిలోని ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్(బాయ్స్) నుంచి 80 మందికి 80 మంది, భద్రగిరిలోని ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్(గరల్స్) నుంచి 79 మందికి 79 మంది, గుమ్మలక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 70 మందికి 68 మంది, గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ నుంచి 34 నుంచి 34 మంది, భద్రగిరి జీటీడబ్ల్యూఏ స్కూల్(గరల్స్) నుంచి 59 మందికి 59 మంది, పి.ఆమిటి జీటీడబ్ల్యూఏ స్కూల్(గరల్స్) నుంచి 78 మందికి 78 మంది, రేగిడి జీటీడబ్ల్యూఏ స్కూల్(గరల్స్) నుంచి 89 మందికి 87 మంది, దుడ్డుఖల్లు జీటీడబ్ల్యూఏ స్కూల్(బాయ్స్) నుంచి 19 మందికి 19 మంది, దొరజమ్ము జీటీడబ్ల్యూఏ స్కూల్(బాయ్స్) నుంచి 27 మందికి 26 మంది, టిక్కబాయి జీటీడబ్ల్యూఏ స్కూల్(బాయ్స్) నుంచి 52 మందికి 52 మంది చొప్పున ఉత్తీర్ణులయ్యారు. వీరిలో భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్(గరల్స్)కు చెందిన బిడ్డిక అఖిల మండల టాపర్‌గా నిలవగా, గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టాపర్‌గా తెర్లాపు దివ్య నిలిచింది. ఈ మేరకు పాఠశాల సిబ్బంది వారిని అభినందించారు.

కొమరాడ: మండలంలో 514 మంది విద్యార్థులకు గాను మొత్తం 471 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ జామి నారాయణస్వామి తెలిపారు. కోటిపాం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 62 మందికి 60 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కాలిశెట్టి భార్గవి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల(బాలకలు)లో 80 మంది విద్యార్థులకు గాను 79 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బోటు శిరీష టాపర్‌గా నిలిచింది. కేజీబీవీలో 37 మంది విద్యార్థులకు 32 మంది ఉత్తీర్ణత సాధించారు.

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలోని దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు)కు చెందిన పాలక గురునాథ్ టాపర్‌గా నిలవడంతో ఆ విద్యార్థిని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి అభినందించారు.

భామిని: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 98 మంది పరీక్షలు రాయగా, 93 మంది.. బాలేరు జెడ్పీహెచ్ స్కూల్ నుంచి 66 మంది పరీక్షలకు హజరు కాగా, 51 మంది.. పెద్దదిమిలి జెడ్పీహెచ్ఎస్‌లో 55 మంది పరీక్షలు రాయగా, 48 మంది పాసయ్యారు. బత్తిలి హైస్కూల్‌లో 61 మందికి గాను 41 మంది, భామిని హైస్కూల్‌లో 51 మందికి 38 మంది, గురుకుల పాఠశాలలో 78 మందికి 70 మంది, కేజీబీవీలో 48 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కాట్రగడ–బికి చెందిన విద్యార్థిని గొటివాడ నీలవేణి, బాలేరు విద్యార్థిని కేవటి రేవతి, పెద్దదిమిలికి చెందిన మంతిరెడ్డి శైలజ, లోహరిజోలకు చెందిన బిడ్డిక మణికంఠ అత్యుత్తమ మార్కులు సాధించారు.

కురుపాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన కర్రి తనుశ్రీ, మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.జ్యోత్స్న, కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.ప్రతిభ, జ్యోతిబా పూలే బాలురు పాఠశాల విద్యార్థి వి.ఆదర్శ్‌కుమార్ అత్యుత్తమ మార్కులు సాధించారు. మండలంలో 597 మంది విద్యార్థులకు గాను 383 మంది బాలురు, 214 మంది బాలికలు పరీక్షలు రాయగా, 352 మంది బాలురు, 208 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

పాలకొండ రూరల్: మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 515 మంది పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 368 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ ఎం.సూర్యనారాయణ తెలిపారు. వీరిలో బాలికలు 206 మంది, బాలురు 162 మంది ఉన్నారు. బడ్డుమాసింగి జీటీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల నుంచి 19 బాలికలు పరీక్షలకు హాజరై, శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ఎం.వి.ఎస్.చలపతిరావు తెలిపారు.

కురుపాం: మండలంలోని 597మంది విద్యార్థులకు గాను 383 మంది బాలురు, 214 మంది బాలికలు పరీక్షలు రాయగా, 352 మంది బాలురు, 208 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

వీరఘట్టం: మండలంలో 516 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 461 మంది ఉత్తీర్ణత సాధించారని, 89.4 శాతం ఉత్తీర్ణత శాతంగా నమోదైనట్లు సిబ్బంది తెలిపారు.

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీ శతశాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 21 మంది అత్యుత్తమ మార్కులు సాధించడం విశేషం.

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి పాఠశాల విద్యార్థులంతా పదో తరగతి పాసయ్యారు. 17 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉత్తీర్ణత సాధించారు.

గరుగుబిల్లి: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 88 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. 11 పాఠశాలల నుంచి 488 మంది విద్యార్థులు హాజరు కాగా, 431మంది ఉత్తీర్ణత సాధించారు.